

# భవానీద్వీపం

–వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 31 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'ఇది వేలసంవత్సరాల తపస్సుతో సిద్ధులు దర్శించి చెప్పిన మార్గం. తమ సర్వస్వాన్ని త్యాగం చేసి, మానవాళి ఆరోగ్యంతో ఆనందంగా పూర్ణాయుష్షును అనుభవించడంకోసం కనుగొన్న అమూల్యమైన నిధి' అగస్త్య పెరియాసన్ నోటివెంట అమృతంలా పలుకులు వెలువడుతున్నాయి.

దట్టమైన పొదలమధ్య అలసట లేకుండా వేగంగా అడుగులేస్తూ ఆయన చెబుతున్నాడు. ఆకాశాన్ని అంటుకునేట్టుగా నాలుగేసి బారల వ్యాసం వున్న మద్దిచెట్ల మధ్యన అలవోకగా ఆగకుండా నడుస్తున్నాడు. మూడు మద్దిచెట్లను వృత్తాకారంలో చుట్టి ఎనిమిది సంఖ్య ఆకారంలో మరొక మూడు చెట్లను చుట్టి సాగుతున్నది నడక. శిష్యులు రెండు బృందాలుగా విడిపోయి రెండుప్రక్కలా ఆయనతో సమాంతరంగా ఎనిమిది ఆకారంలో నడుస్తూ వింటున్నారు.

'కాలి పెద్దవ్రేళ్ల పక్కలకు అంటే రెండవ వేలువైపుకు చెవులకు సంబంధించిన నాడులున్నాయి. పెద్దవ్రేళ్ళ అడుగున పైభాగంలో మెదడుకు సంబంధించిన నాడులున్నాయి. మిగిలిన నాలుగు వ్రేళ్ళకు అడుగున పైభాగంలో కనులకు, మెదడుకు సంబంధించిన నాడులున్నాయి. కుడిపాదంలో

వేళ్ళకు దిగువభాగంలో ఊపిరితిత్తులకు వక్షస్థలానికి సంబంధించిన నాడులున్నాయి. ఎడమపాదంలో అదే స్థలంలో గుండెకు సంబంధించిన నాడులున్నాయి' శ్రోతలు అర్థం చేసుకోడం కోసం అన్నట్టు కొద్దిగా విరామము యిచ్చాడు పెరియాసన్. నడకమాత్రం ఆగలేదు, ఎనిమిది ఆకారంలో భారీ వృక్షాల మధ్య కొనసాగుతూనే వున్నది.

పెరియాసన్ ఎడమప్రక్కనున్న బృందానికి పంక్తి కంఠన్ నాయకత్వం వహిస్తున్నాడు. కుడిప్రక్కనున్న బృందానికి సమర్థుడు నాయకత్వం వహిస్తున్నాడు. సమర్థుడి చెవులు పెరియాసన్ పలుకులకు అంకితమయ్యాయి. కనులు చుట్టూ వున్న దట్టమైన పొదలను, తీగలను, ఆకాశానికి తాకిన మహావృక్షాలను పరికిస్తున్నాయి. ఆయన మనసులో ఎందుకో ఒక ఉద్విగ్నత చోటుచేసుకున్నది. ఎందుకు అని తనలో తానే తర్కించుకుంటున్నాడు. నడక సాగుతూనే వున్నది.

పంక్తికంఠన్ చెవులు పెరియాసన్ పలుకులపైన, కనులు సమర్థునిపైన వున్నాయి. అతడి మనసు మాత్రం దాదాపు ఆరు నెలల క్రితం జరిగిన పోరాటం పైననే వున్నది.

ఏదో పెద్ద గండశిల తాకినట్టు ఆ ఉత్తరాది సన్యాసి కుడి చేయి తన ఎదురు రొమ్ము మీద తగిలింది. ముక్కువెంట, నోటివెంట రక్తం ఎగజిమ్ముతూ తాను నేలకూలుతున్నాడు. గడ్డిపోచను ఎత్తినట్టు తనను గాలిలోకి ఎత్తుతున్నాడతను. అంతవరకూ కొన్ని సంవత్సరాలక్రితం చూసిన కలలా అస్పష్టంగా గుర్తుంది. తరువాత యేమి జరిగిందో తెలియదు. బలహీనంగా తాను కనులు తెరిచినప్పుడు కనిపించిన రూపం స్పష్టంగా గుర్తుంది. రెండుచేతులూ వెనుకకు లేపి, పిడికిళ్లు బిగించి తనను తొక్కడానికి లేపిన ఎడమకాలు కనిపించింది. పలకలు పలకలుగా, చెరియలతో మెలితిరిగిన కొండశిఖరంలా, కండలుతిరిగి వున్నది ఆ కాలు. మరలా కనులు మూతలు పడుతుంటే ఆకాశమంత ఎత్తున అర రెప్పపాటు కనిపించింది ఆ ఆకారం. ఆ ముఖం భయంకరమైన ధమూర్తిలా కనిపించింది. అది యేదో మహావానరం ముఖంలా కనిపించింది. ఉచ్ఛ స్వరాలతో మంత్రపఠనం వినిపిస్తుండగా తనకు మరలా స్పృహ తప్పింది.

ఎంత సమయం గడిచిందో తెలియదు. తాను పూర్తిగా తేరుకునేప్పటికి పెరియాసన్ గంభీరంగా పిలుస్తున్నాడు, సెల్వా! కణ్ణన్! అని. శిష్యులలో వరిష్ఠులు వారిద్దరూ. ' ఈ యిద్దరి పోరాటంపై మీ అభిప్రాయం ఏమిటి? ' అడిగాడు పెరియాసన్. ఏమి చెప్పాలో వారికి తెలియలేదు. మరల తానే అడిగాడు పెరియాసన్ ' సమర్థుడి సాధన ఏ దశలో ఉన్నది? ' ఆసన్ కు ధీటుగా వున్నది ' చెప్పాడు కణ్ణన్. అవును అన్నట్లు తలూపాడు సెల్వన్.

'మర్మవిద్యలోని నాలుగు అంగాలలో మూడింటిని పరిపూర్ణంగా ప్రదర్శించాడు సమర్థుడు! ఆసన్ దాడిని నిలువరించడమే కాదు, అతడిపై పోరాటంలో ఆధిక్యాన్ని ప్రదర్శించాడు ' అన్నాడు పెరియాసన్. వారిద్దరే కాదు, అందరూ అవునన్నట్లు తలలూపారు. 'సమర్థుడు నేటినుండి ఆసన్ గౌరవానికి అర్హుడు! మర్మవిద్యలో పంక్తికంఠన్ తో సమానుడు'

పలికాడు పెరియాసన్. ' కుమార గురవే! కుమార గురవే! శరవణభవ జయ కుమార గురవే! ' అనే నినాదాలతో ఆశ్రమం మారుమ్రోగింది. మర్మవిద్యలో ఆసన్ స్థాయికి చేరుకున్న వీరుడికి చేసే స్తుతి అది.

వినయంగా పెరియాసన్ పాదాలకు నమస్కరించాడు సమర్థుడు. కొంతసేపటిక్రితం ప్రళయకాలసూర్యుడిలా కనిపించిన సమర్థునిరూపం పున్నమిచంద్రుడిలా కనిపించింది యిప్పుడు. తనవైపు మెల్లగా అడుగులేశాడు సమర్థుడు.

'అసంకల్పితంగా పోరాటంలో తీవ్రంగా స్పందించాను, నన్ను మన్నించు సోదరా' అని చేతులు జోడించాడు.

శిష్యబృందం హర్షధ్వానాలు చేసింది. పంక్తికంఠా! అని పెరియాసన్ కంఠం హెచ్చరికలా వినిపించింది. అప్రయత్నంగా ప్రతినమస్కారం చేశాడు తను. గంభీరంగా మ్రోగిన పెరియాసన్ పలుకులతో మరలా వర్తమానములోకి వచ్చాడు పంక్తికంఠన్.

' కనులకు, చెవులకు, మనసుకు అంటే హృదయానికి, మస్తిష్కానికి సంబంధించిన ప్రధానమైన నాడులు అన్నీ పాదాలలో ఉన్నాయి! కనులతో మంచిని చూడడానికి, చెవులతో మంచిని వినడానికి, మనసుతో అందరి మంచిని కోరడానికి, మస్తిష్కంతో మంచి ఆలోచనలు చేయడానికి పాదాలు పనిముట్లు! నడక నడతను తీర్చి దిద్దుతుంది. నడతను బట్టి నడకతీరు వుంటుంది' అంటూ చిరునవ్వులు చిందించాడు పెరియాసన్. ' నడక ఆరోగ్యాన్ని యిస్తుంది, ఆరోగ్యంగా వున్నంతకాలమే నడిచేశక్తి వుంటుంది ' అని తన పలుకుల ప్రవాహాన్ని ఒక నిముషం నిలిపాడు.

ఎటు చూసినా నిలువెత్తున పెరిగిన పొదల నీడలు పొడుగ్గా సాగడం ప్రారంభించాయి. నానాజాతుల అడవిపొదల నీడలు పొదలు పొదలుగా పడుతున్నాయి. విచిత్రమైన పరిమళాల అలలు సెలలుగా రేగుతున్నాయి. అక్కడక్కడా పెనవేసుకున్న అడవి మల్లికలు, జాజులు సౌరభాల మోజులు రేపుతున్నాయి. ఆకాశపు పందిరికి అంతుతెలియని స్తంభాలలా వున్నాయి రంగు రంగుల మద్దిచెట్లు. నేలకనబడకుండా రాలిన మద్ది ఆకులు పరిమళాలను పోటీగా వెదజల్లుతున్నాయి.

అక్కడక్కడా పొదలమధ్యనుండి తళుక్కున మెరుస్తూ మిరుమిట్లు గొల్పుతున్నది పంపానది.నీలిరంగుతో దూరాకాశంలో కలిసిపోయింది. పంప పైకెగిసి గగనమైందో, గగనం జారి పంపా నీరైందో తెలియడంలేదు. పడమటి కనుమలు తెరలు తెరలుగా సాగుతున్న మబ్బుపరదాల మాటున కనిపించి మాయమవుతున్నాయి. పద్దెనిమిది పర్వతాల సహ్యాద్రి పర్వతశ్రేణి అయ్యప్పదేవుడి ఆటస్థలం. పద్దెనిమిది శిఖరాలు కంటికి కనబడితే పునర్జన్మ వుండదట! నడకను కొనసాగిస్తూనే ప్రకృతిసౌందర్యమధువును నేత్రములనే పాత్రలతో సేవిస్తున్నాడు సమర్థుడు.

' కాలినడకనే వందల యోజనాలు తిరిగిన సిద్ధులు రూపొందించిన విధానం ఎనిమిది ఆకారంలో నడవడం! '

మరలా అందుకున్నాడు పెరియాసన్. ప్రాచీన భారతీయుల ఎనిమిది సంఖ్య అనంత తత్వానికి చిహ్నం.

'ఉర్వారుక మివ బంధనాత్' అన్నది ఉపనిషత్. అంతం లేకుండా, అడ్డూ ఆపూ లేకుండా పెరిగే దోసతీగలవంటి జనన మరణచక్ర రూపకమైన సృష్టిచక్రానికి చిహ్నం భారతీయుల ఎనిమిది సంఖ్య! అష్టసిద్ధులు, అష్టాంగ యోగం, అష్ట దిక్కులు, అష్ట దిగ్గజాలు, అష్టదానాలు, అష్ట లక్ష్ములు, అష్ట చిరంజీవులు! ఎనిమిది సంఖ్యకు భారతీయ ధర్మంలో విశిష్ట స్థానం వున్నది ' అంటూ ఏదో చెప్పబోయిన సమర్థుని చూస్తూ ఆగిపోయాడు పెరియాసన్.

' మహాశివునికి అష్టమూర్తులు. అనంతతత్త్వమైన శ్రీకృష్ణావతారం ఎనిమిదవ అవతారం. పంచమహాభూతాలతో మనసు, బుద్ధి, అహంకారం కలిపి అష్టప్రకృతులు. గుణభేదంతో ఆత్మ ఎనిమిది రకాలు. జగజ్జనని లలితాంబనూ అష్టమూర్తిగా కీర్తించాయి పురాణాలు ' అంటూ సంశయిస్తూ ఆగిపోయాడు సమర్థుడు. ప్రశంసాపూర్వకంగా చూస్తూ కొనసాగించమని సంజ్ఞ చేశాడు పెరియాసన్. ఎనిమిది ఆకారంలో నడక కొనసాగుతూనే వున్నది. అందరి శరీరాలు చమటలతో మెరుస్తున్నాయి. వీస్తున్న గాలులు హాయిగా చల్లగా చమట చమ్మలను అద్దుతున్నాయి.

' అమ్మవారి పదహారు పవిత్రమైన కళలలో అష్టమీ కళ ప్రశస్తమైనది. అది నాశనము లేనిది, క్షీణించనిది. అది నిత్యమైనది, కనుకనే దానిని ' నిత్యా కళ ' అన్నాయి శక్త్యాగమాలు! అమ్మవారిని 'అష్టమీ చంద్ర విభ్రాజిత దళికస్థల శోభిత' అన్నది లలితాసహస్రనామం. చంద్రుడికి శుక్లపక్షంలోనూ, కృష్ణ పక్షంలోనూ అష్టమినాడు ఒకేవిధమైన వన్నె వుంటుంది ' అంటూ మౌనం వహించాడు సమర్థుడు. ఆయన మనోనేత్రంలో శ్రీరాముని సరసన సీతమ్మ దర్శనమిచ్చింది. రామయ్య ఎడమచేత విల్లు, ఆ వింటిపక్కన సీతమ్మ ఒక హరివిల్లు! సమర్థుని శరీరంపై పులకలు రేగాయి!

ఇక తన అసహనాన్ని దాచుకోలేకపోయాడు పంక్తికంఠన్. 'ఎనిమిది సంఖ్యకు ఈ నడకకు వున్నలౌకికమైన ప్రయోజనాలు వివరించండి పెరియాసన్' అన్నాడు. నువ్వింతేనా! మార్పు రాదా? అన్నట్టు ఒక చూపు విసిరి కొనసాగించాడు పెరియాసన్. ' ఎనిమిది ఆకారంలో నడక సిద్ధమార్గం. కంటికి, కాలేయానికి, నాడీవ్యవస్థకు, వెన్నెముకకు, ఊపిరితిత్తులకు, హృదయానికి బలాన్నిస్తుంది. శరీరాన్ని వజ్ర సదృశం చేస్తుంది. దీర్ఘాయుష్షునుయిస్తుంది' అని ఆగిపోయాడు పెరియాసన్. 'శరవణ జయ' అని మూడుసార్లు నినదించాడు. అది విరామసూచన.

అందరూ విశ్రాంతిగా ఆగిపోయారు.

అల్లంతదూరంలో వున్న తెల్లమద్దిచెట్టుకిందికి దారి తీశాడు పెరియాసన్. తానూ వెంబడించాడు పంక్తికంఠన్. మిగిలిన శిష్యులందరూ అంతవరకూ ప్రదక్షిణలు చేసిన చెట్లక్రింద రాలిన మెత్తని ఆకులపైన కూర్చున్నారు. ఒక్కసారిగా ఆందోళనతో చలించిపోయింది సమర్థుని మనసు. శరీరంమీది రోమాలన్నీ నిక్కబొడుచుకున్నాయి. ఎన్నడూ ఎవ్వరూ వూహించని ఉపద్రవం పిడుగుపాటులా వచ్చిపడ్డది.

మద్దిచెట్టు నిలువునా మీద కూలినట్టు పైనుండి సర్రున జారి సమర్థుడిని మెలివేసింది భయంకరమైన కొండచిలువ. నల్లని శరీరంమీద ముదురు పసుపు రంగు చారలతో ముప్పై అడుగులపైన పొడవైన మహాసర్పం అది. ముదురు నీలిరంగులోవున్న కనుగుడ్లు మెరిపిస్తూ నిముషంలో నిలువెల్లా పెనవేసింది. పాదాలనుండి భుజాలవరకూ బలంగా మెలివేసి ఎఱ్ఱని కెరటంలాంటి నాలుకను సాచింది. కొండగుహలాంటినోటిని తెరిచి సమర్థుని తలవైపుకు నెమ్మదిగా కదిలించింది. సమర్థుడు కదిలిన కొద్దీ దాని పట్టు బిగించడం ప్రారంభం అయ్యింది.

ఊహించని భయంకర దృశ్యానికి వణికిపోతూ పక్కలకు పరుగెత్తారు శిష్యులు కొందరు. గావుకేకలు పెడుతూ తమ కర్రలను అందుకుని ముందుకురికారు కొందరు. చూస్తున్న దృశ్యాన్ని జీర్ణించుకుని తేరుకోడానికి కొన్ని నిముషాలు పట్టింది అందరికీ.

' విల్లాడివీరా! వీర మణికంఠా! ' అని నినాదం చేస్తూ ముందుకు దూకాడు పెరియాసన్. చేతులు సమ్మెటల్లా బిరుసెక్కాయి. ఇనుప ముళ్ళలా వ్రేళ్ళను నిగిడించి హుంకారం చేశాడు. రెండడుగులు ముందుకు దూకి గాలిలోకి ఎగిరాడు. ఆందోళనగా పెరియా! అని కేకలు పెడుతూ నిలువరించే ప్రయత్నం చేస్తూ తానూ ముందుకు వురికాడు పంక్తికంఠన్. రెప్పపాటులో కనీ వినీ ఎరుగని భయంకర సంఘటన జరిగింది. అంతవరకు పెరియాసన్ ఏ మహావృక్షం కింద నిల్చున్నాడో దాని కొమ్మలపైనుండి మృత్యుపాశాలలా రెండు కొండచిలువలు నేలకు దూకాయి. మృత్యుదూతలు విసిరినట్లు విసురుగా నేలకు పెద్ద శబ్దంతో కూలాయి. ఆ తాకిడికి సుడిగాలికి ఎగిరినట్టు ఆకులు ఎగిరిపడ్డాయి. భయంకరంగా బుసలు రేగాయి.

గాలిలోకి ఎగిరిన పెరియాసన్ గాలిలో వుండగానే జింకపిల్లను పట్టినట్టు పట్టి మెలేసింది ఒక కొండచిలువ. దబ్బున నేలకు కూల్చి అదిమిపెట్టింది కొన్ని నిముషాలు. నివ్వెరపోయిన పెరియాసన్ తేరుకునేలోపు పాదాలనుండి భుజాలవరకు బలంగా మెలేసింది. పెరియాసన్ పెనుగులాడిన కొద్దీ దాని పట్టు బిగుసుకుంటున్నది.

క్రమేపీ కదలికలు ఆగిపోయాయి. నిదానంగా నోటిని తెరిచి ఆయన తలవైపు కదిలింది కొండచిలువ. మెరుపులా వెనక్కు దూకి తప్పించుకునే ప్రయత్నం చేశాడు పంక్తి కంఠన్. ఫలితం లేకపోయింది. బరువుగా కెరటంలా లేచిన ఆ మహాసర్పం కాలును దొరకబుచ్చుకుంది. మరుక్షణంలో రెండు తొడలను పట్టేసింది. నేలకు కూలిన పంక్తికంఠన్ రెండునిముషాలలో నడుమువరకూ దాని బంధంలో యిరుక్కుపోయాడు. రెండుచేతులతో దానిపై దాడి చేయడానికి విశ్వప్రయత్నం చేశాడు. కానీ కాళ్ళు నేలమీద లేకపోవడంతో చేతులలో బలం లేకపోయింది. ఎముకలను పిప్పిచేస్తూ దాని పట్టు బిగుస్తుంటే చేతులతో విడదీసుకునే ప్రయత్నం చేశాడు. ఒడుపుగా చేతులను కూడా చుట్టి భుజాలవరకూ మెలేసింది. అతడి కదలికలు అణిగి పోయేంతవరకూ నేలకు అదిమిపట్టి వుంచింది. క్రూరంగా ముదురు నీలిరంగు కనులు మెరిపిస్తూ నోరు తెరిచింది. నిదానంగా అతడి తలను దొరకబుచ్చుకోడానికి ముందుకు సాగింది.

దాని నోటికి చిక్కకుండా తలను విసురుగా కదిలించడానికి ప్రయత్నించాడు పంక్తికంఠన్. క్రమేపీ బలం హరించుకుపోయి తల నిలిచిపోయింది. పైకి చూస్తున్న వెర్రిచూపులకు అరవై అడుగుల పైన కొమ్మలలో కనిపించారు ఆరుగురు వ్యక్తులు. వేరే రెండు వృక్షాలమీదా అంతే సంఖ్యలో రెండు బృందాలు కనిపించాయి. ఆరుగురేసి మూడు బృందాలుగా వున్నారు. ఇరులా జాతికి చెందిన గిరిజనులు వాళ్ళు. తమిళ, మలయా సరిహద్దు అరణ్యాలు, పంబా తీర కారడవులలో కనిపించే గిరిజనజాతి వారిది. కాలనాగులను, విశేషించి కొండచిలువలను పట్టుకోడంలో వారు ప్రపంచప్రసిద్ధులు.

' అయ్యో అన్నా! అన్నా!' అంటూ తలలు బాదుకున్నారు. గుండెలు బాదుకుని హాహాకారాలు చేస్తూ ఉడుతల్లా క్షణాలలో చెట్లు దిగారు. నెత్తీ నోరూ బాదుకుని రోదిస్తూ పొదలు చెట్లమాటున పారిపోయారు.

వరుసగా మూడు భయంకరమైన కొండచిలువలు వచ్చిపడడంతో నివ్వెరపోయారు శిష్యులు. నిశ్చేష్టులయ్యారు.

నలుగురు శిష్యులు విరుచుకుపడిపోయారు. స్పృహ కోల్పోయారు. మిగిలినవారు కొన్ని నిముషాలపాటు గావు కేకలుపెడుతూ చిందరవందరగా మూడు కొండచిలువల చుట్టూ పరుగులుపెట్టారు. కొన్ని నిముషాలకు ఆలోచన కలిగి నలుగురేసి మూడు బృందాలుగా విడిపోయారు. తమ చేతి కత్తులు కర్రలతో ఆ భయంకరమైన కొండచిలువలమీద దాడికి విఫలయత్నాలు చేయడం ప్రారంభించారు.

ఒక్కొక్కటీ ముప్పై అడుగులకు పైనే పొడవున్న బర్మాజాతి కొండచిలువలు అవి. మలబారు, బర్మా, బెంగాలు,మలేషియా అడవులలో కనిపించే మహాభయంకర సర్పాలు. మదపుటేనుగులనూ పట్టి మింగేసే బలం వాటిది. పాతికనుండి ముప్పై అడుగులవరకూ తేలికగా పెరుగుతాయి. అంత భారీ శరీరముతోనూ చురుకుగా కదలడం, వేగంగా దడి చేయడం వాటి ప్రత్యేకత. నోటికి చిక్కిన ఆహారాన్ని అవి వదిలిపెట్టిన దాఖలాలు ఎక్కడా లేవు అని చెప్పుకుంటారు ఇరులా జాతి గిరిజనులు. భయంకరంగా బుసలు కొడుతూ తమపై దాడిచేస్తున్న శిష్యులను దూరంగా తరమడానికి ప్రయత్నిస్తున్నాయి. కొండచిలువలు. తగులుతున్న దెబ్బలు వాటికి ప్రమాదకరంగా లేవు. అవకాశం దొరికినకొద్దీ తలలను పట్టుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. క్రమేపీ వాటి పట్టులో చిక్కిన శరీరాలు నిశ్చలనంగా అయిపోయాయి. శిష్యుల గొంతులలో ఆందోళన , ఆవేదన, శోకం పెరుగుతున్నాయి. తన ద్రోహచింతన తనకూ

మృత్యువైంది అని అర్థమైంది 'పంక్తికంఠన్'కి. 'ఒకటి కాదు. రెండూ చాలవు. మూడు కావాలి, మూడు! అవసరాన్ని బట్టి మూడింటినీ వదలాలి. అతడు సామాన్య మానవుడు కాదు' ఇరులా గిరిజనులతో తాను చెప్పిన మాటలు ఇప్పుడు అతడి చెవులలో మారుమోగుతున్నాయి.

పెరియా! యిదంతా నావల్లనే జరిగింది. సమర్థన్ ! నన్ను మన్నించు ! పెరియా నన్ను మన్నించు! ఏడుస్తూ వెర్రికేక వేశాడు పంక్తికంఠన్. పెరియాసన్, సమర్థుడు విన్నారో లేదో తెలియదు. తన తలమీదికి వాలుతున్న కొండచిలువ కోరలు కనిపించాయి అతనికి. కణతలమీద అవి కసిగా దిగడం తెలిసింది. భరించలేని దుర్వాసన సోకింది. తనపని అయిపోయింది అని అర్థమైంది అతడికి.

మూసుకుపోతున్న కనులకు తనను తొక్కడానికి పైకిలేచిన కాలు మరొకసారి కనిపించింది. శిష్యులు, పెరియాసన్ చేసిన నినాదాలు చెవులలో మరలా మారుమ్రోగాయి. జయ బజరంగ బలీ! జయ రాం! జయ రాం!జయరాం! తనకు తెలియకుండానే జయ రాం అని చావు కేక చివరి నిశ్వాసంతోపాటు బయటకు వచ్చింది. నిశ్చలమైన అతడి తలను ఒడిసిపట్టింది కొండచిలువ. తలమీద పడుతున్న దెబ్బలను లెక్క చేయకుండా మింగడం మొదలెట్టింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS